
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 31 డిసెంబరు 2024



1న చిలుకూరుకు అదనపు బస్సులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా నగరం నుంచి తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు ఆలయానికి మరో 10 ఆర్టీసీ బస్సులను అదనంగా నడపనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీన చిలుకూరు ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మెహిదీపట్నం డిపో నుంచి ఇప్పటికే 11 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. రద్దీని బట్టి మరిన్ని బస్సులు పెంచే అవకాశం ఉందని చెప్పారు.



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 50 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 50 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 31, గృహ నిర్మాణ శాఖకు 10, డీపీవో రెండు, మున్సిపల్ 2, ల్యాండ్‌ప్రొటెక్షన్ 2, విద్యుత్ శాఖకు 1, ఎండోమెంట్‌కు సంబంధించి రెండు అర్జీలు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అధికారులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న ఆశా వర్కర్లు

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మహేశ్వరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ విమర్శించారు. ఆశాల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర సోమవారం తుక్కుగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ఆశాలకు నెలకు కనీసం వేతనం రూ.18 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, రామచందర్, కవిత పాల్గొన్నారు.



న్యూ ఇయర్ వేడుకలకు ముస్తాబైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్

నయా జోష్!

నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 31 వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. నగర శివార్లలోని స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లు, క్లబ్‌లు, కన్వెన్షన్ సెంటర్లు వేడుకలకు ఆతిథ్యమిచ్చేందుకు ముస్తాబయ్యాయి. పలుచోట్ల సినీతారలతో సందడి చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ, విదేశాల నుంచి కళాకారులను తీసుకువచ్చి డీజేలు, లైవ్ మ్యూజిక్‌లతో వేడుకలు నిర్వహించనున్నారు. వినోదంతో పాటు తిన్నోళ్లకు తిన్నంత... తాగినోళ్లకు తాగినంత అనే రీతిలో నిర్వాహకులు ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

కొత్త సంవత్సర వేడుకలకు అంతా సిద్ధం

- హోటళ్లు, రిసార్ట్‌లు, క్లబ్‌లు ముస్తాబు
- సరికొత్త ఆఫర్లతో స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు



గండిపేట్‌లోని ఓ బేకరీలో సిద్ధంగా ఉన్న కేకులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్, శంకర్‌పల్లి మండలంలోని ప్రగతి రిసార్ట్స్, పర్వేద పరిధిలోని ఫాంఎక్సోటికా రిసార్ట్స్, గ్రీన్‌వాలీ, మొయినాబాద్ మండలం కనకమామిడిలోని బ్రౌన్‌టౌన్, పోలో రైడింగ్ క్లబ్, చిలుకూరులోని మృగవని ఏకో రిసార్ట్స్‌లో, ముర్తూజగూడలోని ఈవెన్ రిసార్ట్స్ న్యూ ఇయర్ జోష్‌కు ముస్తాబయ్యాయి. వ్యక్తిగత ఫామ్ హౌస్‌లలో వేడుకలను నిర్వహించుకునేందుకు కొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా న్యూఇయర్ సందడి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల వద్ద వేడుకలు చేసుకునేందుకు యువకులు సిద్ధమయ్యారు. కొత్త సంవత్సర వేడుకలను మిగతా 8వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- ఫిబ్రవరి 3న లక్ష డప్పుల మహా ప్రదర్శన
- ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్ మాదిగ



మాట్లాడుతున్న అశోక్ మాదిగ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై. అశోక్ మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహ్మామాదిగ ఆధ్వర్యంలో సోమవారం షాద్‌నగర్‌లో ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీసాయి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి అశోక్ హాజరై మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని కోరారు. కొంత మంది స్వార్థపూరిత మాలలు వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ కోరుకున్న సామాజిక న్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు, లక్ష డప్పుల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మద్దిలేటి మాదిగ, రావుగాళ్ళ బాబుమాదిగ, కె. రామచందర్ మాదిగ, బి. శివకుమార్‌మాదిగ, జి. ప్రశాంత్ మాదిగ, పి. ప్రణయ్‌మాదిగ, శంకర్‌మాదిగ, బక్కని రవి, పి. కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఓపీ విభాగంలో పైసా వసూల్

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఉద్యోగుల చేతివాటం



ఓపీ చీటి కోసం క్యూలో ఉన్న రోగులు

ప్రభుత్వ ఆస్పత్రిలో వసూల్ రాజాలు ఎక్కువయ్యారు. వైద్యం కోసం వచ్చే రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ దందా సాగిస్తున్నారు. ఓపీ చీటి ఇవ్వాలంటే రూ.10 చెల్లించాల్సిందేనని రోగులను డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాన్పుల కోసం వచ్చే వారిని కూడా వదలడం లేదు. గర్భిణులకు సహాయం అందించేందుకు అటెండర్లు, ఆయాలు పైసలు అడుగుతూ పీడిస్తున్నారు. ప్రైవేటులో వైద్యం ఖర్చులు భరించలేక సర్కార్ దవాఖానాకు వస్తే అడుగడుగునా డబ్బులు వసూలుపై తలలు పట్టుకుంటున్నారు.

- రూ. 10 ఇస్తేనే రోగులకు ఓపీ చీటి
- ఆయాలు, అటెండర్లదీ ఇదే తీరు
- గర్భిణుల నుంచి డబ్బులు డిమాండ్

షాద్‌నగర్, డిసెంబరు 30: షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి రోజుకూ 400 నుంచి 500 మంది రోగులు వస్తుంటారు. వారు ముందుగా అవుట్ పేషెంట్ విభాగంలో ఓపీ చీటి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ చీటీని ఇవ్వడానికి మిగతా 8వ పేజీలో...

మెమో జారీ చేశాం



డబ్బులు వసూలు చేస్తున్న సదరు ఉద్యోగికి మెమో జారీ చేశాం. గతంలో టీబీ సీల్స్ కోసం రూ. 5 చెల్లించాల్సిన అవసరం ఉండేది. ఎవరివద్ద డబ్బులు వసూలు చేయవద్దని సిబ్బందిని ఆదేశించాను. కాన్పుల కోసం వచ్చే కుటుంబ సభ్యులను పైసలు డిమాండ్ చేయొద్దని ఆయాలను హెచ్చరించాను. ఇక నుంచి ఆస్పత్రి సిబ్బంది రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా పైసలు అడిగితే నాకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటా.

- డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్

ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన

- తలకొండపల్లిలో నిరసన ర్యాలీ
- మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలాల కోసం పేదలు కదం తొక్కారు. పట్టాలు ఇచ్చిన తమకు స్థలాలు చూపాలని తలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఏళ్ల కాలంగా పోరాటం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ధర్నా నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని 6,7 సర్వేనెంబర్లలోని ప్రభుత్వ భూమిలో 1998, 1999, 2000 సంవత్సరంలో మూడు విడతలుగా 180మందికి ఇళ్ల పట్టాలు అందించారు. రెండు దశాబ్దాలు గడిచినా స్థలాలు చూపలేదు. దీంతో రెండేళ్ల క్రితం లబ్ధిదారులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు స్థలాలు చూపాలని ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అప్పట్లో మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయారు. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తేవడంతో 2023లో పాత పట్టాలు ఉన్నవారికి తిరిగి నూతన పట్టాలు అందజేశారు. రెండేళ్లవుతున్నా ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. 20 రోజుల క్రితం ఇళ్లస్థలాలు చూపాలని బీజేపీ నాయకులు వినతి పత్రం ఇచ్చినా స్పందన లేదు. దీంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిరసనకు దిగారు. ఆమనగల్లు- షాద్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. తహసీల్దార్ నాగార్జున అక్కడికి చేరుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు కేటాయించేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుమణి రవిగౌడ్, జిల్లా నాయకులు శానమోని పాండు, బక్కికుమార్, నీలకంఠ పాండు, పెరుమాళ్ల రాజు, పద్మ అనిల్, యాదయ్య, శేఖర్‌రెడ్డి, కుమార్, హరికాంత్, సుదర్శన్, మహేశ్, హర్యానాయక్, మహేశ్, శ్రీను, నాగరాజు, పాండు, వెంకటేశ్, రాము, శివ పాల్గొన్నారు.

10కోట్ల వ్యయం.. దాతల సాయం!



శరవేగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణం

దాతల ఉదారత.. స్వచ్ఛందంగా విరాళాలు అందజేత

8

ఫార్మాసిటీని రద్దు చేయాలి



అప్పటివరకు పోరాటం కొనసాగిస్తాం

ఫార్మాసిటీ బాధిత పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి

6

సహనానికి మార్గం ధ్యానం

- పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి



వేడుకల్లో మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): సహన సిద్ధికి, మానసిక వికాసానికి ధ్యానం గొప్ప సాధనమని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, ధ్యాన గురువు పరిణతి పత్రీజీ అన్నారు. పదవ రోజు సోమవారం కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా కొనసాగాయి. అభ్యాసకులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం పిరమిడ్ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మణ్ రావు, హన్మంత రావు, సాంబశివరావు, మాధవి, లక్ష్మి, దామోదర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అక్షిత



అవార్డు అందుకుంటున్న అక్షిత

- యాచారం ఉన్నత పాఠశాల బాలిక ఘనత

యాచారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ 2024 కప్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు యాచారం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అక్షిత అండర్-14 విభాగంలో ఎంపికైంది. జిల్లా స్థాయిలో 100మీటర్ల, 200 మీటర్ల షాట్‌పుట్ విభాగాలలో ఆమె ప్రతిభ కనబర్చడంతో సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి మెమోంటోను అందించారు. అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి క్రిషిక కూడా జావెలిన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ అందుకుంది. వీరిద్దరూ నగరంలోని గచ్చిబౌలిలో మంగళవారం నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ, ఉపాధ్యాయులు భోజయ్య, సీతారాం, గాయత్రి, నీరజ, వెంకటరెడ్డి, పీడీ మల్లేష్ తదితరులున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వికారాబాద్/దౌల్తాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడిందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దాసరి గోవిందు తన కూతురిపై లైంగికదాడికి పాల్పడిన అభియోగంతో అప్పటి ఎస్ఐ రమేశ్, పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలోని దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడు గోవిందు వికారాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి చంద్రకిషోర్ సోమవారం గోవింద్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.1.50లక్షల జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధించారని చెప్పారు. ఈ కేసులో పీపీలు రాజేశ్వర్, మెరాజ్ ఫిర్దౌస్, మొదటి ఐవో తోట సుబ్రహ్మణ్యం, రెండో ఐవో వి.రమేష్, ఐవో కరుణసాగర్‌రెడ్డి, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో రవిగౌడ్, సీఐ శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, సీడీవో సురేష్‌గౌడ్, బ్రీపింగ్ ఆఫీసర్, కోర్టు లైజన్ ఆఫీసర్ నిరంజన్‌గౌడ్, బాధితురాలు బ్రీపింగ్ అధికారి కీర్తి ఆకుల అనుసంధాన అధికారులు వీరన్న, నిరంజన్‌గౌడ్‌లు ఉన్నారని ఇట్టి అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కేసులో బాధితులకు డీఎల్ఎస్ఏ డిస్ట్రిక్ట్‌లీగల్ సర్వీస్‌అథారిటీ ద్వారా రూ.4లక్షలు అందించాలని ఎస్పీ ఆదేశించారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మేడ్చల్ యువతికి స్వర్ణం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన కత్తిప్రసన్న స్వర్ణ పతకం సాధించింది. దీంతో సోమవారం ప్రసన్నను మేడ్చల్ నియోజకవర్గ ఏబ్లాక్ అధ్యక్షుడు పానగంటి మహేష్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్న చిన్న వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో రెండుసార్లు త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించినట్లు గుర్తుచేశారు. మేడ్చల్ పేరును అంతర్జాతీయ స్థాయి వరకు ప్రసన్న తీసుకెళ్లిందన్నారు. ఆమె తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మేడ్చల్‌కు చెందిన పలువురు నాయకులు, తోటి క్రీడాకారులు ఆమెను అభినందించారు.



త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన కత్తి ప్రసన్న

కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి
- పట్టణంలో రూ.10కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన

కొడంగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు మంజూరైన రూ.10కోట్లతో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, రాజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.


కొడంగల్: పనులకు శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కొడంగల్/బొంరాస్‌పేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక కడా కార్యాలయంలో సోమవారం కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్, అప్పాయిపల్లి, చిన్ననందిగామ, చిట్లపల్లి, ఇందనూర్, కొడంగల్, నాగారం, పర్సాపూర్, పెద్దనందిగామ, రావుల్‌పల్లి, రుద్రారం, టేకుల్‌కోడ్, ఉడిమేశ్వరం, ఉప్పర్‌పల్లి గ్రామాలకు చెందిన 98 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌గుప్త, ఉషారాణి, ప్రశాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలో 55 మంది, దుద్యాల మండలంలో 94 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ

కొడంగల్ పట్టణ శివారులోని బండెల ఎల్లమ్మ ఆలయ సమీపంలో అయ్యప్పసేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త తదితరులు పడి పూజలో పాల్గొన్నారు.

మద్యం నేరాలపై నిరంతర నిఘా

- 2024లో జిల్లాలో 888 కేసులు, 350 మంది అరెస్టు
- గుడుంబా రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం
- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్



వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మద్యం సంబంధిత నేరాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వికారాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా ఉంచడంలో ఎక్సైజ్ శాఖ నిరంతర కృషి చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 2024 సంవత్సరంలో 888 కేసులను నమోదు చేసి 350 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ, సరఫరాకు సంబంధించి ఈ ఏడాది 354 కేసులు నమోదు కాగా 184 మంది వ్యక్తులను అరెస్టు చేసి పది వాహనాలను సీజ్ చేశామన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా కల్లు విక్రయాలకు సంబంధించి 142 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి 119 కేసులు నమోదు చేశామని, 86 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని చెప్పారు. కల్లు అమ్మే వ్యక్తులను గుర్తించి దాదాపు 142 కేసులను నమోదు చేశామని, 36 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆరు కల్తీకల్లు కేసులు నమోదయ్యాయన్నారు. అదేవిధంగా జిల్లాలో 21 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేస్తూ 26 మందిని అరెస్ట్ చేశామన్నారు. 165 కేజీల గంజాయిని పట్టుకోవడమే కాకుండా, గంజాయి సరఫరాకు వినియోగిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా 20 ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. 474 లీటర్ల ఎన్‌డీపీఎల్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో 2023లో కేవలం 62 ఈవెంట్స్ మాత్రమే పర్మిషన్ తీసుకోగా 2024లో ఏకంగా 258 ఈవెంట్స్‌కి పర్మిషన్ కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. మన జిల్లా మద్యం అమ్మకాల్లోనూ వృద్ధి నమోదైందన్నారు. గత సంతవత్సరం దాదాపు రూ.668కోట్లు విలువ గల మద్యం అమ్మకాలు జరగగా ఈ ఏడాది దాదాపు రూ.728 కోట్లుగా నమోదైందన్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆటలా?

బీజేపీ ధార్మిక సెల్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం న్యూయర్ సందర్భంగా మద్యం జీవోలను తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతోందని బీజేపీ ధార్మికసెల్ ఇన్‌చార్జి కొప్పుల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మద్యం జీవోను వ్యతిరేకిస్తూ వినతిపత్రం ఇచ్చి ప్రభుత్వ జీవో ప్రతులను కార్యాలయం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకోవడమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యానికి హాని తలపెట్టే చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతగిరి ఆలయం చుట్టు పక్కల పరిసర ప్రాంతాలలో ఫారెస్ట్‌లో యువకులు మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అనంతగిరి చుట్టు పక్కల అనుమతులు లేని రిసార్ట్స్ చాలా వెలిశాయన్నారు. వాటిలో కూడా మద్యం, గంజాయి వాడకం జరుగుతుందని వీటిపైన ఎక్సైజ్ శాఖ, పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, ప్యాట శంకర్, యాదగిరి, శివరాజు, ధార్మిక్ సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాఘవేందర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం జీవోను తగలబెడుతున్న బీజేపీ నాయకులు

కాకతీయుల ఆనవాళ్లను పరిరక్షించాలి

కొత్తూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి ఆనవాళ్లను పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి స్థానికులకు సూచించారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ హనుమాన్ దేవాలయ పరిసరాల్లోని పంట పొలాల్లో ఇటీవల బయటపడిన శివ లింగం, నంది విగ్రహాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. హనుమాన్ దేవాలయ పరిసరాల్లోని పంటపొలాల్లో శివలింగంతో పాటు, నంది విగ్రహం బయటపడడంతో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పట్నం కృష్ణంరాజు పురావస్తు శాఖకు సమాచారం అందించారు. దాంతో శివనాగిరెడ్డి స్థానిక కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్‌తో కలిసి శివలింగం, నందివిగ్రహాన్ని పరిశీలించి, స్థానికులకు పలు సూచనలు చేశారు. కాగా, అవి 13వ శతాబ్దం నాటివని శివనాగిరెడ్డి చెప్పారు. రెండు విగ్రహాలను హనుమాన్ దేవాలయంలో భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహగౌడ్, కోస్గి యాదయ్య, ప్రకాష్‌గౌడ్, హరీష్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, చింతకింది నర్సింహగౌడ్, పాండు స్వామి, తదితరులు పాల్గొన్నారు.


పంటపొలాల్లో లభ్యమైన నంది విగ్రహం

ఫార్మాసిటీని రద్దు చేసే వరకూ పోరాటం


తాటిపర్తిలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న సరస్వతి

యాచారం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో విషపూరితమైన ఫార్మాసిటీని ఏర్పాటు చేయొద్దని, దానిని రద్దు చేసేదాకా తాము పోరాటం ఆపేది లేదని ఫార్మాసిటీ బాధిత పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి అన్నారు. కాంగ్రెస్ పాలకులు జనాలను మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని తాటిపర్తిలో బాధిత రైతులతో సమావేశమై మాట్లాడారు. ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చి.. అధికారంలోకి రాగానే మళ్లీ ఏర్పాటుకు ఎందుకు పూనుకుంటున్నారని ప్రశ్నించారు. పచ్చటి పంట పొలాల మధ్య ఫార్మాసిటీ నెలకొల్పి వాతావరణాన్ని విషతుల్యం చేయడం ఎందుకని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పట్టా భూములను వెంటనే తొలగించాలని కోరారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నిరంజన్, బుచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, బాలకృష్ణ, సోమయ్య, బాల్లయ్య, అంజమ్మ, చెన్నయ్య తదితరులున్నారు. కాగా, ఇకనుంచి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు బాధిత రైతులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. తాటిపర్తి గ్రామంలో ఆందోళనకారులతో వారు మాట్లాడారు. ర్యాలీలు, సభలు పెట్టుకోవడానికి అనుమతి తీసుకోవాలని, లేకపోతే అడ్డుకుంటామని సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తాం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, డిసెంబరు 30(ఆంధ్ర జ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇందులో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయం ఏవో రాజశేఖర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచానికి పరిమితమైన దివ్యాంగులకు 'సదరం' అందివ్వాలి


ఎంపీడీవోతో కలిసి వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యత్వంతో కదలలేని స్థితిలో ఉన్నవారికి ఎంపీడీవో నివేదిక ఆధారంగా సదరం స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు ప్రమాదాలు, వివిధ కారణాలతో దివ్యాంగులుగా మారిన వారిని ప్రభుత్వం గుర్తించి తోడ్పాటునందించాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రేపని మల్లేశ్ అనారోగ్యం కారణంతో కాలు కోల్పోయి మంచానికి పరిమితమయ్యాడు. సోమవారం ఎంపీడీవో సుజాత, స్థానిక నాయకులతో కలిసి మల్లేశ్‌ను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కడ్తాల మండలంలో స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం లేని వారికి ఎంపీడీవో నివేదిక ఆధారంగా సదరం సర్టిఫికెట్లు అందించాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండలాధ్యక్షుడు రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


గౌరవ వందన స్వీకరిస్తున్న ఏసీపీ రంగస్వామి

తలకొండపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్‌తో సమావేశమై కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. దొంగతనాల నిర్మూలనకు గ్రామాలు, దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమనగల్లు సీఐ బి.ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు


అండర్ పాస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

ఘట్‌కేసర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రయాణికులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలో సోమవారం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు అండర్‌పాస్ నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు. వాహనదారుల సౌకర్యార్థం అవకాశం ఉన్న చోట అండర్ పాస్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు గొంగల్ల మహేష్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహేష్, జితేందర్‌నాయక్, సురేష్‌నాయక్, రమేష్ ముదిరాజ్, జవాజీ అశోక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తా విస్తరణకు సహకరించాలి


అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ మ్యాప్‌ను చూపిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తాను సోమవారం విస్తరణపై ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్-బీజాపూర్, మహబూబ్‌నగర్-తాండూర్ ప్రధాన కూడలి అంబేడ్కర్ చౌరస్తా ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఇందుకు చౌరస్తా విస్తరణతో సుందరీకరించేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలన్నారు. వారి వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పరిశీలన


ఆటోమెటిక్ వాతావరణ కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న శివరాజ్

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో చలిగాలుల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. జిల్లాలో మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పనితీరును పరిశీలించి చలి తీవ్రతను నమోదు చేస్తున్నారు.ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను టీజీడీపీఎస్ అధికారి శివకుమార్ మహిపాల్‌తో కలిసి సోమవారం తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల వరకు పరిశీలించారు. సైక్లోమీటర్ సహాయంతో ఉష్ణోగ్రతలను పరిశీలించగా, 13.6 డిగ్రీలు నమోదైంది. జిల్లాలో 29 అన్‌బ్లాక్ కేంద్రాలు ఉండగా, వీటి ద్వారా జిల్లాలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి దిశ, గాలి వేగం వంటివి తెలియనున్నాయి. జిల్లాలోని వాతావరణ కేంద్రంలో పని చేసే సెన్సార్ల ఆధారంగా ఉష్ణోగ్రతల వివరాలు నమోదు కానున్నాయి.



మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్

ఇష్టారాజ్యం!

సమయపాలన పాటించని పలువురు అధికారులు

- అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారంటూ సమాధానాలు
- అమల్లోకి రాని 'బయోమెట్రిక్'!
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో పరిస్థితి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం కార్యాలయానికి వస్తూ అడిగితే ఫీల్డ్ పర్యటనకు వెళ్లామంటూ చెప్పడం పరిపాటిగా మారింది. ఇంత జరుగుతున్నా మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నేటికీ బయోమెట్రిక్ విధానం అమల్లోకి రావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌ను తూంకుంట మున్సిపల్ అంతాయపల్లిలో జీ ప్లస్ టూ భవనంలో 86 గదుల్లో ఏర్పాటు చేశారు. అక్కడ కలెక్టర్‌తో పాటు ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓ, డీఆర్ఓ, డీఆర్‌డీఓ, డీపీఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు దాదాపు 400 మంది విధులు నిర్వహిస్తున్నారు. సమయపాలన విషయమై చర్చకు రావడంతో కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆరు నెలల క్రితమే కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో కలెక్టరేట్ ఏఓ చర్యలు చేపట్టారు. ఈ విధానం ద్వారా ఉద్యోగుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడంతో పాటు విధుల నిర్వహణ సక్రమంగా సాగుతుందని అందరూ భావించారు.

అన్ని చర్యలు తీసుకున్నా..

ప్రతీ రోజు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకుని సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యలో అధికారులు ఫీల్డ్‌కు వెళ్లాల్సి వస్తే కార్యాలయం నుంచి వెళ్లే సమయం, వచ్చే సమయం కూడా బయోమెట్రిక్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్‌లో నాలుగు చోట్ల బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఈ మేరకు ఉద్యోగుల వివరాలను బయోమెట్రిక్ యంత్రాల్లో రికార్డు చేశారు. అధికారులు అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ నేటికీ బయోమెట్రిక్ విధానం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని అలుసుగా తీసుకున్న కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొంత పనులపై తిరుగుతూ..

ఆయా కార్యాలయాల్లో సదరు అధికారి కనిపించకపోవడంతో సార్ లేరా అని ప్రశ్నించిన వారికి ఫీల్డ్‌కు వెళ్లారనే సమాధానం సిబ్బంది నుంచి రావడం పరిపాటిగా మారింది. కొందరు అధికారులు ఫీల్డ్ పర్యటన వంకతో సొంత పనులపై తిరుగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలకు చెక్ పెట్టాలంటే బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

సాంకేతిక కారణాలతోనే ఆలస్యం

కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసి ఓ సంస్థకు అప్పగించాం. సిబ్బంది వివరాలను కూడా బయోమెట్రిక్ మిషన్లలో రికార్డు చేయించాం. వేలిముద్రల విధానంలో సాంకేతిక కారణాల వలన ఆలస్యమవుతున్నట్లు పనులు అప్పగించిన సంస్థ వారు తెలిపారు. త్వరలోనే బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభిస్తాం. **- రామ్మోహన్, ఏఓ, కలెక్టరేట్**

పార్టీలు, ఈవెంట్లకు అనుమతులు తప్పనిసరి

శంకర్‌పల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసుల అనుమతి లేకుండా పార్టీలు, ఈవెంట్లు నిర్వహించరాదని శంకర్‌పల్లి, మోకిల సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబులు తెలిపారు. శంకర్‌పల్లిలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ న్యూయర్ వేడుకల్లో భాగంగా అనుమతి లేకుంగా రిసార్టులలో పార్టీలు, ఈవెంట్లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. మత్తు పదార్థాలు, గుట్కాలపై గట్టి నిఘా ఉంచామని, మద్యాన్ని చిన్నపిల్లలకు విక్రయించరాదని సూచించారు. న్యూయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పెద్దపెద్ద శబ్దాలతో ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు/కడ్తాల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు నిబంధనలకు లోబడి శాంతియుతంగా జరుపుకోవాలని ఆమనగల్లు, కడ్తాల సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్‌లు కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు, కడ్తాల పోలీసు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం సీఐలు విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పోలీసు శాఖ పరంగా అన్ని ముందు జాగ్రత్తలు, బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

- వికారాబాద్ కల్టెర్ ప్రతీక్ జైన్
- ప్రజావాణిలో 79 దరఖాస్తులు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 79 దరఖాస్తులు రాగా, భూ సమస్యలు అధికంగా వచ్చినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారం తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర ఉన్నారు.

దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు: మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో 123 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్‌కుమార్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న రైతులు

రైతులందరి వద్ద పత్తిని కొనుగోలు చేయాలి

- ఎన్నెపల్లి చౌరస్తాలో రైతుల నిరసన
- కలెక్టర్ చొరవతో శాంతించిన అన్నదాతలు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన పత్తిని కొనుగోలు చేయాలని రైతులు రోడ్డు ఎక్కి ధర్నా నిర్వహించారు. పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో సోమవారం పత్తిలోడు ట్రాక్టర్లను అడ్డం పెట్టి ధర్నా చేశారు. అయ్యప్ప కాటన్‌మిల్‌లో రోజుకు 2వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామని చెబుతున్నారని, మిగితా రైతుల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేసి రోడ్డు పక్కకు జరపగా రైతులు అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. దీంతో కలెక్టర్‌ను పలువురు రైతులు వెళ్లి కలవగా కలెక్టర్ కాటన్‌మిల్ నిర్వాహకులతో మాట్లాడి రైతుల పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ టీ.వి హన్మంత్‌రావు

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అదనపు ఎస్పీ టీవీ హన్మంత్‌రావు హెచ్చరించారు. డీపీవో కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమంలో భాగంగా సోమవారం అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు అధికారులు, పోలీసు, లేబర్, స్వచ్ఛందసంస్థలు, పిల్లల సంక్షేమ కమిటీ, చైల్డ్ లైన్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసిబాల కార్మికులు లేకుండా కృషి చేయాలన్నారు. పిల్లల సంక్షేమ కమిటీ చైర్మన్ వెంకటేశ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, అన్వర్ పాషా, బీఆర్‌బీ కోఆర్డినేటర్ కాంతారావు, డబ్ల్యూసీడీ మెంబర్స్, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ టీం సభ్యులు, లేబర్ డిపార్ట్మెంట్ సభ్యులు, ఆపరేషన్ స్మైల్‌టీం సభ్యులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి ప్రజాదరణ

- సభ్యత్వ నమోదుకు విశేష స్పందన
- పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి ప్రజాదరణ పెరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అక్టోబరు 26న ప్రారంభమైన సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా లక్షా 21 వేల మంది తీసుకున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు తిరిగి టీడీపీ వైపు వస్తున్నారని, సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసి అపార అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు ఏపీలో ముఖ్యమంత్రిగా, టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఉండడం, తెలంగాణలో సైతం పార్టీ సభ్యత్వంపై దృష్టి పెట్టడంతో ప్రజలు ముందుకు వచ్చి, సభ్యులుగా చేరుతున్నారని చెప్పారు. ప్రజా స్పందన చూస్తుంటే తెలంగాణలో సైతం టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రకృతిని, వ్యవసాయ భూములను నాశనం చేసిందని విమర్శించారు. పేదలు పంటలు పండించి, బతకడానికి ఇచ్చిన భూములను సైతం లాక్కొని పరిశ్రమలకు ధారదత్తం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదల భూముల జోలికి వెళ్లకుండా పంట పొలాలు, పర్యావరణాన్ని పరిరక్షించాలని బక్కని డిమాండ్ చేశారు.

చకచకా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కొత్తూర్/కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి కావొస్తుందని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మున్సిపాలిటీ పరిధిలో 1857 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు సర్వే పనులు 95శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలో వందశాతం సర్వే పూర్తి చేసి, యాప్‌లో పెడతామని కమిషనర్ బాలాజీ తెలిపారు. కందుకూరు మండలంలోని 35 గ్రామాలలో 15241 ఇళ్లకుగాను సోమవారం నాటికి 12945 ఇళ్లను సర్వే పూర్తి చేశామని ఎంపీవో గీత తెలిపారు. మండలంలో 84.94శాతం సర్వే పూర్తి చేశామని, మిగిలినవి రెండురోజుల్లో పూర్తిచేస్తామని, నేదునూర్‌లో 1119ఇళ్లకు గాను 1075 ఇళ్లసర్వే చేశామన్నారు. ప్రతి పేదకుటుంబానికి ఇళ్లను మంజూ రు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

హెచ్‌ఎంపై దాడి హేయం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


హెచ్‌ఎం రాములును పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వాముల ముసుగులో దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. అయ్యప్ప మాలతో ఉన్న విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కొట్టాడనే నెపంతో కొందరు అయ్యప్ప మాలదారులు పలువురు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం రాములుపై విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఈమేరకు సోమవారం మీర్‌పేటలోని రాములు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అయ్యప్ప స్వాముల ముసుగులో కొందరు బీజేపీకి చెందిన వ్యక్తులు పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంపై దాడి చేయడం సరికాదని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు చంద్రమోహన్, రామచందర్, కృష్ణ, పెంటయ్య, బాలరాజు, శేఖర్, కవిత తదితరులు ఉన్నారు. అలాగే హెచ్‌ఎంపై దాడి సరికాదని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్ అన్నారు. రాములుపై దాడికి నిరసనగా సోమవారం పాఠశాల భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్, గ్లోరి, కృష్ణ, విజయమోహన్‌రెడ్డి, శ్రావణి, కౌసల్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



కులకచర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాకాలం పంట నూర్పిడి, ధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో రైతులు యాసంగి సాగులో భాగంగా వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉన్నారు. ఆశించిన దానికంటే ఎక్కువగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో యాసంగిలో 10500 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనావేశారు.

ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

శంకర్‌పల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా.. డాక్టర్ ఖాదర్ వలి తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో సోమవారం సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్-ఐనా(ఏఐఎన్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిల్లెట్స్-ఆధునిక ఆరోగ్యం కోసం తెలివైన ఎంపిక అనే అంశంపై ఆయన ప్రసంగించారు. చిరుధాన్యాలను రోజువారి ఆహారంలో చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పోషకాలు అధికంగా ఉన్న పురాతన చిరుధాన్యాలు ఊబకాయం, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో ఎంతగానో తోడ్పడతాయన్నారు. అమృత తుల్యమైన అంబలిని వదిలి శరీరానికి హాని కలిగించే టీ, కాఫీలను తాగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ ధాన్యాల కంటే చిరుధాన్యాలు తక్కువ వర్షపాతంతో పండుతాయని గుర్తు చేశారు. పాలు, చక్కెర, మాంసం, గుడ్డు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ కంపెనీల మోజులో పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని హితవు పలికారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్.ఎస్. గణేష్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ పి. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రమిస్తున్న డా.రవీందర్

మేడిపల్లికి బస్సులు నడపండి

యాచారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి, పల్లెచెల్క తండా, ఆమనగల్లు వరకు ఇబ్రహీంపట్నం నుంచి బస్సులు నడపాలని ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో అనంతరెడ్డికి సమర్పించిన వినతిపత్రంలో డాక్టర్ రవీందర్‌గుప్తా, గ్రామస్తులు కోరారు. కల్వకుర్తి డిపో అధికారులు గతంలో బస్సులు నడిపేవారని, కరోనా సమయం నుంచి బస్సులు రాక వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం డీఎంకూ వినతిపత్రం అందించారు.

నేడు 'భగీరథ' నీటి సరఫరా బంద్

యాచారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా గౌరిదేవపల్లిలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(మంగళవారం) మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. యాచారం, మంచాల, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మండలాల పరిధిలోని వాటర్‌మెన్లు స్థానికంగా లభించే నీటిని అందజేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

- శరవేగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణం
- దాతల ఉదారత.. స్వచ్ఛందంగా విరాళాలు అందజేత

రూ.10 కోట్ల వ్యయం.. దాతల సాయం!

షాద్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి కళాశాలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. సుమారు 2వేల గజాల్లో మూడంతస్థుల్లో భవన నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.10 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈమేరకు దాతలు పెద్దఎత్తున విరాళాలు అందజేసేందుకు ముందుకొస్తున్నారు.

52 ఏళ్లుగా మరమ్మతులకు నోచని కళాశాల

షాద్‌నగర్ పట్టణంలో 1970వ దశకంలో ప్రభుత్వ కళాశాల నిర్మాణం జరిగింది. ఆ తర్వాత కాలేజీలో కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. దాంతో కళాశాల పూర్తిగా శిథిలమైంది. ఆరు నెలల క్రితం కళాశాల శిథిలావస్థ గురించి 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళాశాలను సందర్శించి శిథిలావస్థలో ఉన్న కాలేజీని పరిశీలించి కొత్త జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చారు. దానికి తోడు కనీస సౌకర్యాలు కల్పించాలని సంకల్పించారు. అందుకు పూర్వ విద్యార్థులందరినీ ఒక వేదికపై తెచ్చి కళాశాల దీనస్థితిని వివరిస్తూ నూతన కాలేజీ నిర్మాణం కోసం విరాళాలు అందజేయాలని కోరారు. ఈ ఏడాది సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవం రోజున భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అదేరోజున పలువురు ప్రముఖులు రూ.20లక్షల విరాళాలు అందజేశారు. పనులు ప్రారంభమవగానే కొత్తూరు మండలానికి చెందిన యుగంధర్‌రెడ్డి రూ.25లక్షలు, హైదరాబాద్‌కు చెందిన మరో వ్యాపారి రూ.25లక్షలు విరాళాలు ప్రకటించారు. వీరితో పాటు ప్రముఖ వ్యాపారులు, నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత కాశీనాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థి దండు వాసుతో పాటు మరికొందరు రూ.5లక్షల చొప్పున విరాళాలు అందజేశారు. వారు రోజుల క్రితం బీఆర్ఎస్ నేత నందారం అశోక్‌గౌడ్ రూ.15లక్షలు, మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు లక్ష చొప్పున విరాలాలు అందజేశారు. దాంతో దాతల సహకారంతో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల పనులు ఊపందుకున్నాయి. దాతలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తుండటంతో వచ్చే విద్యా సంవత్సరం వరకు కళాశాల అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.


శరవేగంగా జరుగుతున్న కాలేజీ నిర్మాణ పనులు

విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత



ఒక ఎమ్మెల్యేగా, సాధారణ పౌరుడిగా తాను విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తాను. ఇందులో భాగంగానే తాను విద్యనభ్యసించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు కాలేజీ శిథిలావస్థకు చేరింది. నూతన భవనాన్ని భావితరాలు గుర్తుంచుకునేలా నిర్మించాలని నిర్ణయించుకున్నా. కేవలం దాతల సహకారంతో నిర్మిస్తాం. చాలామంది విరాళాలు అందించడం హర్షణీయం.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే

దాతల సహకారంతో నిర్మాణం హర్షణీయం



ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించడం హర్షణీయం. దీనివల్ల ఇంటర్ విద్యావ్యవస్థ బాగుపడుతుంది. కార్పొరేట్ తరహాలో నిర్మిస్తుండటంతో విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు వెళ్లరు. విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందన్న ఉద్దేశంతో నా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.5లక్షలు విరాళం అందజేశా. దాతలు ముందుకు రావల్సిన అవసరం ఉంది.

- దండు వాసు, వ్యాపారవేత్త

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నర్సింహారావు కథనం మేరకు.. కొందుర్గు మండల కేంద్రానికి చెందిన వడ్డె రాజు(40) మండల పరిధిలోని మదన్‌పల్లి ఒరియంటేన్ గార్డెన్‌లో పని చేస్తున్నాడు. సోమవారం తోటలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే, అతడి మృతికి గల కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు. త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ..

మంచాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచాల పోలీస్ స్టేషన్ పరిధి తాళ్లపల్లిగూడలో సోమవారం చోటుచేసుకుంది. యాచారం మండలం చౌదర్‌పల్లికి చెందిన అమీర్‌పేట్ మౌనిక(21)ను రెండు నెలల క్రితం తాళ్లపల్లిగూడకు చెందిన రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. తాళ్లపల్లిగూడలోని అత్తవారింట్లో ఉదయం ఎవరూ లేని సమయంలో మౌనిక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది అయితే, ఆమె తరచూ కడుపునొప్పితో బాధపడేదని మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మౌనిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాలయ్య తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆదిభట్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.రాజు తెలిపిన వివరాల మేరకు.. నేపాల్‌కు చెందిన గోవింద సాయి(60) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయాంజాల్‌లోని ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో కుటుంబంతో ఉంటూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో మన్నెగూడ వద్ద రోడ్డు దాటుతుండగా బొంగ్లూర్ నుంచి బీఎన్ రెడ్డి వైపుకు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గోవింద సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ప్రజాపాలనలో అందరికీ మేలు


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పేదలకు భవిష్యత్తుపై భరోసా ఏర్పడిందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి, తలకొండపల్లి, వెల్దండ మండలాలకు చెందిన పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.82 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. కల్వకుర్తి నియోజవర్గానికి ఇందిరమ్మ పథకం కింద మొదటి విడత 3,500 ఇళ్లు కేటాయించారని.. అదనంగా మరో వెయ్యి ఇళ్లు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, మానయ్య బీచ్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్ రెడ్డి, యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆనంద్, రవీందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నరేశ్ నాయక్, బాబా, రవీందర్, సంపత్, వస్పుల శ్రీశైలం, శ్రీకాంత్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నయా జోష్!

(5వ పేజీ తరువాయి)

పుసర్కరించుకుని బేకరీలు, స్వీట్ హౌస్‌లు ఐటమ్స్ సిద్ధం చేస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఈ సారి కొత్త సంవత్సరాన్ని శాంతి భద్రతల నడుమ జరపాలని తగిన భద్రతా చర్యలు చేపడుతున్నారు.

రూ.లక్షకుపైగా టిక్కెట్ ధరలు

నూతన సంవత్సర వేడుకలకు సంపన్న వర్గాలు భారీ ఖర్చులకు వెనుకాడడం లేదు. వీరిని దృష్టిలో పెట్టుకుని కొన్ని హోటళ్లు, రిసార్ట్‌ల యాజమాన్యాలు ఆర్భాటంగా న్యూఈయర్ వేడుకలు నిర్వహిస్తున్నాయి. పలు నక్షత్రహోటళ్లు, రిసార్ట్‌ల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇక్కడ టిక్కెట్ ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. మాదాపూర్ రెడ్ రిహినోలో డీజే అభిలాష్ కార్యక్రమానికి రూ.5499 నుంచి గరిష్టంగా టిక్కెట్ ధర రూ.1,50,000లుగా నిర్ణయించారు. అయిదు గచ్చిబౌలిలో హార్ట్ కప్ కాఫీ 'ఎరా2' పేరుతో నిర్వహిస్తున్న మ్యూజిక్ పార్టీకి టిక్కెట్ ధర రూ.2499 నుంచి రూ1,00,000 నిర్ణయించారు.. ప్రఖ్యాత సింగర్స్ జెమ్మర్, డీజే కార్నివోర్ పాల్గొంటున్నారు. దుర్గం చెరువ వద్ద బీచ్ థీమ్ పార్టీకి గరిష్టంగా రూ. 45వేల టిక్కెట్ ధర ఉంది. శామీర్‌పేటలోని లియోనియో రిసార్ట్ న్యూఈయర్ వేడుకలకు ముస్తాబైంది. ఇక్కడ రూమ్‌ల ధరలు ధర గరిష్టంగా రూ. 34999గా నిర్ణయించారు. అలాగే ప్రగతి రిసార్ట్‌లో కూడా న్యూఈయర్ ప్యాకేజీలు ఉన్నాయి. ఇక్కడ కూడా రూమ్‌లకు గరిష్టంగా రూ. 25వేల వరకు ప్యాకేజీలు పెట్టారు.


న్యూఇయర్ ఈవెంట్‌కు ముస్తాబు చేసిన మృగవని రిసార్ట్

ఓపీ విభాగంలో పైసా వసూల్

(5వ పేజీ తరువాయి)

అవుట్ పేషెంట్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు రోగుల నుంచి రూ.10 వసూలు చేస్తున్నారు. అలాగైతేనే ఓపీ చిట్టి రాసిస్తామని కండీషన్ పెడుతున్నారు. తమ వద్ద డబ్బులు లేవంటే వారిని గంటల తరబడి నిలబెడుతున్నారు. ఉచితంగా వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడమేమిటని రోగులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి నిర్వాకం

కమ్యూనిటీ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి ఇలా రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గతంలో టీబీ సంబంధిత వ్యాధులకు రోగుల నుంచి రూ.5 తీసుకునే వారని, ఈ విధానాన్ని గత ప్రభుత్వాలు ఎప్పుడో రద్దు చేశాయని వారు తెలిపారు. కానీ, అవుట్ పేషంట్ సేవలు అందించే ఉద్యోగులు మాత్రం ఇప్పటికీ పాత పద్ధతినే అవలంబిస్తున్నారని ఆస్పత్రి వర్గాలే చెప్పడం గమనార్హం.

ఎస్సీ వర్గీకరణకు పోరాడదాం


షాద్‌నగర్ సభకు వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చౌదరిగూడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కలిసికట్టుగా పోరాడుదామని ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండలాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రం నుంచి షాద్‌నగర్‌లో పట్టణంలో నిర్వహించిన వెయ్యి గొంతులు-లక్ష డప్పుల కార్యక్రమానికి డప్పు కళాకారులు, నాయకులు భారీగా బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్య క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెంటయ్య, శ్రీను, నరేందర్, సందీప్, రామస్వామి, శ్రీనివాస్, ప్రశాంత్, నర్సింహులు, యాదయ్య, రాజేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సభకు తరలిన సీపీఐ నాయకులు

చౌదరిగూడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ వందరోజుల సభకు సీపీఐ నాయకులు తరలివెళ్లారు సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జంగయ్య, వెంకటేష్, నర్సింహ, కృష్ణ, లింగం లక్ష్మమ్మ, యశోద తదితరులు తరలివెళ్లారు.

బీజేపీని బలోపేతం చేయాలి


బూత్ కమిటీతో పాపయ్యగౌడ్

మహేశ్వరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు ముఖ్య భూమిక పోషించాలని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పెండ్యాల గ్రామంలో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బూత్‌స్థాయి నుంచి పార్టీ బలపడాలని అలాంటప్పుడే పార్టీ పరంగా ఏ ఎన్నికల్లోనైనా విజయం సాధించడానికి వీలుంటుందన్నారు. అనంతరం పెండ్యాల గ్రామ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నర్సింహను ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఆయిళ్ల యాదయ్యగౌడ్, సామయ్య, శీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : ఎంఈవో


చేవెళ్ల : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

షాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం షాబాద్‌లో జడ్పీహెచ్ఎస్(బాలుర)లో సాంఘికశాస్త్రం మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సాంఘికశాస్త్రం మానవుడు తన ప్రగతిని ఏవిధంగా ఉపయోగించుకోవచ్చునో వివరిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోవిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

చేవెళ్ల : మండల విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయిలో సాంఘిక శాస్త్రం ప్రతిభా పరీక్షను టెన్త్ విద్యార్థులకు నిర్వహించారు. ఎంఈవో పురందాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి పరీక్షలు చాలా వరకు ఉపయోగపడుతాయన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 వంటి పరీక్షలలో ఎలా ప్రశ్నలు ఉంటాయో.. అదేవిధంగా విద్యార్థులకు ప్రశ్నపత్రం ఇచ్చినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు జనవరి మొదటి వారంలో ఇవ్వనున్నట్లు చెప్పారు. టీపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు సురదీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాచారం : పరీక్షల సమయంలో బట్టీ పట్టి చదవకుండా ఇష్టంతో సబ్జెక్టును అర్థం చేసుకొని చదువుకోవాలని జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. యాచారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోషల్‌టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ప్రశ్నపత్రం విడుదల చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పోటీపరీక్షలలో రాణించాలంటే అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. సోషల్ స్టడీస్‌పై ఎక్కువగా అవగాహన కల్పించుకోవాలన్నారు. హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో లక్ష్మణ్

60వ రోజుకు చేరిన రిలే దీక్షలు


దీక్షలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు

తలకొండపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 60వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. పాలనా సౌలభ్యం కోసం 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, ఆంజనేయుడు గౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. నాయకులు వెంకట్రాములు, ముత్యాలు, కర్ణ, నాగయ్య, నారాయణరెడ్డి, సాయిలు, నర్సింహ, లక్ష్మయ్య, దాసు, వెంకటయ్య, రాము, రాజు నాయక్, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి


మేడిగడ్డ తండాలో పర్యటిస్తున్న ఎంపీవో వినోద

ఆమనగల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యమని మండల పంచాయతీ అధికారి వినోద అన్నారు. గ్రామాలలో తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాల విషయంలో కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు. మండలంలోని మేడిగడ్డ తండాలో సోమవారం వినోద పర్యటించారు. తాగునీటి పథకాలు, మురుగునీటి కాలువలు, అంతర్గత రోడ్లు, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య గుర్చి స్థానిక నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దాంతో ఎమ్మెల్యే ఆదేశానుసారం ఎంపీవో తాగునీటి పథకాలను పరిశీలించి నీటి ఇబ్బందుల గుర్చి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండ చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు మల్లేశ్ నాయక్, విజయ్‌రాథోడ్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

కడ్తాల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న కడ్తాల మండల కేంద్రంలో బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ కోరారు. బస్‌పాస్ కౌంటర్ లేక విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కడ్తాలలో సోమవారం లాయక్‌అలీ విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు కడ్తాలలో కంట్రోలర్ పాయింట్ ఏర్పాటు చేసి బస్‌పాస్ కౌంటర్‌ను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కందుకూరు వరకు ఉన్న సబర్బన్ సిటీ బస్సు సౌకర్యాన్ని కడ్తాల వరకు పొడిగించాలని లాయక్‌అలీ కోరారు. అదేవిధంగా అచ్చంపేట, కల్వకుర్తి బస్ డిపోల నుంచి హైదరాబాద్‌కు పల్లె వెలుగు, ఆర్డినరీ బస్సులను నడపాలని కోరారు. ఈమేరకు ఆయా డిపోల నుంచి ఆర్డినరీ బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సంక్షిప్తంగా

- **కందుకూరు** : సమాజంలో శాంతి నెలకొనాలంటే ప్రతీ వ్యక్తి విధిగా దైవభక్తి కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తగూడలో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఇరుముడి పూజలో పాల్గొని పూజలు చేశారు. నాయకులు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, పాండుగౌడ్, మల్లారెడ్డి, వెంకటేష్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.
- **కేశంపేట** : మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన కమ్మరి సత్యనారాయణ ఆదివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్ సోమవారం అనుచరులు, బీఆర్ఎస్ నాయకులతో రూ.5వేలు పంపించి మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. గ్రామానికి బీఆర్ఎస్ నాయకులు సురమోని సత్యనారాయణ, జంగయ్య, రాములు ఆర్థిక సాయం చేశారు. బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు వెంకటేష్, శంకర్‌నాయక్, పద్మజీ, నిరంజన్, జంగాచారి, రంగయ్య తదితరులున్నారు.
- **మహేశ్వరం** : హక్కుల సాధనకోసం బడుగు, బలహీన వర్గాలు రాజకీయాలకతీతంగా ఏకం కావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేష్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమీన వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నాయకులు వెంకటేష్, రాజు, శ్రీకాంత్, తిరుమలేష్, సురేష్, కుమార్, శివ, నవీన్, నందు తదితరులు పాల్గొన్నారు.
- **యాచారం** : మండలంలోని నందివనపర్తి మాజీ సర్పంచ్ వి.రాజు నాయక్ ఇటీవల డాక్టరేట్ అందుకోవడంతో సోమవారం గ్రామానికి చెందిన పలువురు గ్రామపెద్దలు, యువకులు ఘనంగా సత్కరించారు, పూలమాలలు, శాలువలతో స న్మానించారు. పేదల కడగండ్లు తీర్చడానికి తాను చొరవ తీసుకుంటానని. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరు ముందుండాలని చెప్పారు. డాక్టరేట్ పొందడం కంటే పేదలను అన్నివిధాలా ఆదుకోవడమే ముఖ్యఉద్దేశ్యమని రాజు చెప్పారు.
- **తలకొండపల్లి** : మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్ సోమవారం తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్ తిరుపతిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో తిరుపతిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా తగిన నిధులు మంజూరు చేయించాలని తిరుపతిని కోరినట్లు రాఘవేందర్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు రాఘవేందర్ చెప్పారు. సుబ్రమణ్యం, చంద్రకుమార్ తదితరులు ఉన్నారు.
- **చౌదరిగూడ** : మూరుమూల గిరిజన ప్రాంతానికి చెందిన విద్యార్థి ఖరగ్‌పూర్ యూనివర్సిటీలో ఐఐటీ పట్టా అందుకున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గోవులబాండ తండాకు చెందిన ఆకాశ్ ఐఐటీ ఖరగ్‌పూర్ ఓషియన్ ఇంజనీరింగ్ అండ్ నావల్ ఆర్కిటెక్చర్ విభాగంలో సీటు సాధించి 2019-2024లో డిగ్రీతోపాటు ఎంటెక్ పూర్తి చేసి ఐఐటీ పట్టా అందుకున్నారు. ఆకాశ్ వికారాబాద్‌లో మేధా జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 92 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఐఐటీలో సీటు సాధించాడు. ఈమేరకు యువకులు, తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు అండగా ఉంటామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లు అన్నారు. నిరుపేదలు, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన రాయకంటి సాలమ్మ మూడు రోజుల క్రితం మృతిచెందింది. సోమవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. బీఆర్ఎస్ తరఫున లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5వేలు, ఆనంద్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, భిక్షపతి, చెన్నయ్య, సురేశ్, రమేశ్, శ్రీరాములు, యాదయ్య, కరుణాకర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువత ఆధ్యాత్మికత వైపు నడుస్తూ ఆదర్శంగా ఎదగాలని షాద్‌నగర్ మున్సిపాలిటిలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నందారం అశోక్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఫరూఖ్‌నగర్‌లో నిర్మిస్తున్న శివాలయం, హనుమాన్ దేవాలయాల కోసం రూ.3లక్షల 69 వేలను అశోక్‌యాదవ్ విరాళముగా ఇచ్చారు.


విరాళం ఇస్తున్న నందారం అశోక్‌యాదవ్

క్యాలెండర్ ఆవిష్కరణ



శంషాబాద్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ పీఏసీఎస్ చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పీఏసీఎస్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మల్లారెడ్డికి రూ.12లక్షలు, యాదయ్య యాదవ్‌కు రూ.10లక్షల 90వేల రుణాలు, అమరేందర్‌రెడ్డి, భావన, సంతోష, జంగయ్య, మామిళ్ల కుమార్, దీప, అభిలాష్, రాజశేఖర్ రెడ్డి, రఘునాథ్, శ్రీనివాస్‌లకు రూ.9లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆమనగల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్లో స్వపరిపాలన, సాంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తులు, జాతీయ నేతలు, వైద్యులు, ఇంజనీయర్లు, వివిధ ప్రాంతాల సాంప్రదాయ దుస్తుల్లో, వివిధ వృత్తుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. చైర్మన్ అల్లాజీగౌడ్ అధ్యక్షతన ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్ సావిత్రి, కరస్పాండెంట్ సుజాత, అకడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.